6న ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

రాంగోపాల్‌పేట్: ఎస్పీ రోడ్ వీరహనుమాన్ దేవాలయంలో ఈ నెల 6వ తేదీన శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు. గురువారం ఆయన దేవాలయ ప్రధాన అర్చకులు బద్రినాథాచార్యులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 6వ తేదీ ఉదయం సీతా రాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ ఉంటాయని పెద్ద ఎత్తున భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు హాజరు కావాలని వారు తెలిపారు.

డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం

లాలాపేట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 21న సీతాఫల్‌మండిలో నిర్వహించతలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశానికి ముఖ్య అతిథిగా రావాలనీ కోరుతూ నిర్వాహకులు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డికి, తెలంగాణ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ప్లీనరీ సమావేశం వాల్‌పోస్టర్‌ను డిప్యూటీ మేయర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో దయానంద్, సురేందర్‌రెడ్డి, చీమ శ్రీనివాస్, శివకుమార్, భూపాల్, కొండస్వామి, జగన్, జానకీరెడ్డి తదితరులున్నారు.

బంగారు పతక విజేతకు ఘన సన్మానం


విజేత నిషాను సత్కరిస్తున్న దృశ్యం

లాలాపేట: తెలంగాణలోని వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్(విట్టా) లాలాపేటకు చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నిషా గత నెల 27న ఢిల్లీలో జరిగిన పారా నేషనల్ ఛాంపియన్‌షిప్ ఖేలో ఇండియాలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. ఈ మేరకు గురువారం లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియంలో తెలంగాణలోని వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (విట్టా)ఆధ్వర్యంలో నిషాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు వైడి ఉపేంద్రనాథ్ పాల్గొన్నారు. విట్టా లాలాపేట అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్ కుసుమ, విట్టల్ బేతి, క్రీడాకారులు సురేష్ కుమార్ కంచు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ప్రవేశ ద్వారం ఎన్‌సీసీ గేటు వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 400 ఎకరాల భూమిని హెచ్‌యూసీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాలని, నగరంలో బయోడైవర్సిటీని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నెల్లి సత్య, అజయ్, అశ్విన్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. రోడ్లు జలమయం

పలుచోట్ల ట్రాఫిక్ జామ్


బేగంపేట రహదారిలో వర్షపు దృశ్యాలు..


బేగంపేట రహదారిలో నిలిచిపోయిన వాహనాలు...


ఓయూ-మాణికేశ్వర్‌నగర్ రహదారిలో చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్ షెల్టర్

సనత్‌నగర్: అకాల వర్షంతో జన జీవనం అతలాకుతలమైంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సనత్‌నగర్, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. రోడ్లపై నిలిచిన వరద నీటి కారణంగా వాహనాల వేగం నెమ్మదించి ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సార్‌నగర్ ప్రధాన రహదారితో పాటు బేగంపేట మార్గాల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సాయంత్రం వేళ కార్యాలయాలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వారంతా తమ వాహనాలతో ఒక్కసారిగా తమ వాహనాలతో రోడ్ల మీదకు రావడంతో ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.


జలమయమైన లాలాపేట సత్యానగర్ రోడ్డు

చెరువులను తలపించిన లాలాపేట బస్తీలు

లాలాపేట: తార్నాకలో దాదాపు గంటకుపైగా ఏకధాటిగా వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్ తదితర లోతట్టు ప్రాంతాలు అంతర్గత రోడ్లు చెరువులను తలపించాయి. ఇండ్ల ముందు పార్క్ చేసిన వాహనాలు సగం వరకు వరద నీటిలో మునిగాయి. లాలాపేట, తార్నాక ప్రధాన రహదారిలో కొంత సేపు వాహనాల రద్దీ నెలకొంది. తార్నాక, కాలనీ, లాలాపేట బస్తీలలో డ్రైనేజీలు, మ్యాన్ హోళ్లు పొంగి పొర్లాయి.


తార్నాక ప్రధాన రహదారిలో..

శ్రమించిన ట్రాఫిక్ పోలీసులు

సనత్‌నగర్: భారీ వర్షంతో జలమయంగా మారిన రోడ్లను క్లియర్ చేయడంలో ట్రాఫిక్ పోలీసులు శ్రమించారు. ఒకవైపు ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు ముందుకు కదిలేలా చూడడంతో పాటు వరదనీటిని మ్యాన్‌హోళ్లలోకి మళ్లించేలా చర్యలు చేపట్టారు. బేగంపేట ప్రధాన రహదారిలోని నందిని హోటల్ వద్ద గురువారం కురిసిన భారీ వర్షంతో చెరువును తలపించే విధంగా వరదనీరు భారీగా చేరింది. ఈ క్రమంలో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. నార్తజోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు వరదనీటిని మ్యాన్‌హోళ్లలోకి వెళ్లేలా చూశారు.


వాహనాలు సాఫీగా వెళ్లేలా చూస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తదితరులు


ఆర్ట్స్ కాలేజీ వద్ద ..

కంటోన్మెంట్: తాడ్‌బంద్, సెంటర్ పాయింట్ చౌరస్తాల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బస్తీలు, కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి- న్యూ బోయిన్‌పల్లి మార్గంలో మోకాలి లోతు వరద చేరడంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పికెట్ పార్కు నీటితో నిండిపోయింది.

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బోలక్‌పూర్, పద్మారావునగర్, మోండా మార్కెట్, రాణీగంజ్, ఆర్పీ రోడ్డు, ఓల్డ్‌బోయిగూడ, బైబిల్‌హౌస్ ప్రాంతాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ బస్తీ ప్రాంతంలోని ఇండ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. పద్మారావునగర్ వెంకటాపురం కాలనీలోని తుంగభద్ర మహిళా మండలి కమ్యూనిటీహాల్ ప్రహరీ కూలడంతో పెద్ద ఎత్తున వరదనీరు చుట్టు ప్రక్కల ప్రాంతాల ఇండ్లకి వచ్చి చేరింది.


వెంకటాపురం కాలనీలో ఇళ్లలోకి చేరిన వరదనీరు

పాదచారుల రక్షణకు ప్రత్యేక చర్యలు

సికింద్రాబాద్: నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో సందడిగా ఉండే సికింద్రాబాద్ ఒలిఫెంటా వంతెన సమీపంలోని చిలకలగూడ కూడలిలో పాదచారుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ అధునాతన ఏర్పాట్లతో ఆధునీకరణ పనులు చేపట్టాలనుకున్నా ఇక్కడి పరిస్థితులు సహకరించడం లేదు. చివరకు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను ఆన్‌చేసి పాదచారుల రాకపోకల కోసం జీబ్రా లైన్లు గీయాలన్నా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రత్యే ఏర్పాట్లు అన్నింటినీ పక్కన పెట్టిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌పాత్‌ల ఆధునీకరణ పనులు కొద్ది రోజుల క్రితమే పూర్తి చేశారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు, ఎక్కడపడితే అక్కడ పాదచారులు ఫుట్‌పాత్‌లు దిగి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం చిలకలగూడ కూడలి ఆసాంతం నిర్మించిన ఫుట్‌పాత్‌ల మీదుగా స్టీల్ బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలగూడ మార్గంలో ఫుట్‌పాత్‌లకు బారికేడ్ల ఏర్పాటు పనులు పూర్తి చేసిన అధికారులు మిగతా మూడు వైపుల మార్గాల్లోని ఫుట్‌పాత్‌లకు బారికేడ్లు బిగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


చిలకలగూడ మార్గంలోని ఫుట్‌పాత్‌లకు బారికేడ్లను ఏర్పాటు

బాధితులు సంతృప్తి చెందేలా పరిహారం

ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం: కంటోన్మెంట్ పరిధిలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌లో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం ఇప్పించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. రాజీవ్ రహదారి మార్గంలో ప్యారడైజ్ చౌరస్తా నుంచి శామీర్ పేట వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారి సందేహాల నివృత్తి కోసం ఏడోవార్డు టీచర్స్ కాలనీలో అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల వల్ల సామాన్యులు నష్టపోకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కారిడార్‌లో భూములు కోల్పోతున్న వారికి మార్కెట్ రేటు కన్నా అధికంగా పరిహారం ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో సందేహాల నివారణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. డీఆర్‌ఓ వెంకటాచారి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (ల్యాండ్ ఆక్విజేషన్) అపర్ణ, ఓఎస్డి మనోహర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

గోవు మహా హారతికి విరాళం

సనత్‌నగర్: గోవు మహా హారతి కార్యక్రమంలో భాగంగా చైత్ర నవరాత్రి అఖండ జ్యోతి మహోత్సవానికి బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ తనవంతు సహకారం అందించారు. గోవు మహా హారతి నిమిత్తం రూ.25,000లను విశ్వహిందూ మహాసంఘ్ అధ్యక్షులు, బుల్లితెర నటుడు శ్రీవైభవ్ సూర్యకు విరాళంగా అందజేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం


లీల (ఫైల్)


పంకజ్ (ఫైల్)

చిలకలగూడ: చిలకలగూడ, రాంగోపాల్‌పేట్ ఠాణాల పరిధిలో ముగ్గురు అదృశ్యమయ్యారు. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. మెట్టుగూడకు చెందిన రాముల లీల (61) గతనెల 3న హన్మకొండలో ఉంటున్న సోదరి ఇంటికి రైలులో వెళతానని ఇంట్లో చెప్పి వెళ్లింది.అయితే హన్మకొండ చేరలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త గురువారం పోలీసులను ఆశ్రయించాడు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి....

సీతాఫల్‌మండి ఓంకార్‌సదన్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న పంకజ్‌కుమార్ (43) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. గత నెల 31న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. భార్య చంచల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చిలకలగూడ ఏఎస్‌ఐ దివాకర్‌రావు తెలిపారు.

రాంగోపాల్‌పేట్: ఆర్యవైశ్య అభ్యుదయ సంఘంలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. రాంగోపాల్‌పేట్ పోలీసులు తెలిపిన మేరకు..నిజామాబాద్‌కు చెందిన రాజన్న (44) పీజీరోడ్‌లోని విశ్వకర్మ సంఘం భవనంలో స్వీపర్‌గా పనిచేశాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఫిబ్రవరిలో ఇంటికి వెళ్లిపోయాడు. ఉగాది బోనస్ కోసం గత నెల 26న వచ్చాడు. 27వ తేదీన ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం మేనేజర్ భార్యకు పుష్పకు ఫోన్ చేసి రాజన్న మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్నాడని చెప్పారు. దీంతో ఈ నెల 1న భార్య వచ్చి చూడగా రాజన్న కనిపించ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమతి లేకుండా వేసిన బోర్ సీజ్

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీంద్రనగర్‌లో అనుమతి లేకుండా వేసిన బోర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఓ వ్యక్తి అనుమతులు తీసుకోకుండా బోరు వేశారనే సమాచారంతో అమీర్‌పేట తహసీల్దార్ పద్మ సుందరి సిబ్బంది పంపించి విచారణ జరిపించారు. బోర్‌కు ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించి నివేదిక ఇవ్వడంతో వాల్టా చట్టం ఆధారంగా బోర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. గురువారం ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌ను కలిసిన కార్పొరేటర్ వినతిపత్రం అందించారు.

రైలుకిందపడి వ్యాపారి ఆత్మహత్య

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. జనరల్‌బజార్‌లో నివాసముంటున్న పురుషోత్తమ్ (49) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది జేమ్స్‌స్ట్రీట్-సంజీవయ్యపార్కు రైల్వేస్టేషన్ల మధ్యలోని ట్రాక్ వద్ద వేగంగా వస్తున్న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘనంగా ఆరోహణ్ కార్యక్రమం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం 'ఆరోహణ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీచ్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా రంగాల్లో...అంశాల్లో తమ సృజనాత్మకతను చాటుకున్నారు. జేసిఐ సికింద్రాబాద్ ప్రతినిధులు విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

కంటోన్మెంట్: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం వైస్ ప్రెసిడెంట్ పెద్దాల నర్సింహ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఐదో వార్డు మహత్మాగాంధీ నగర్‌లో తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యకు నివాళులు అర్పించారు. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అమరుడైన తొలి కురుమ వ్యక్తి అన్నారు. నాయకులు సాయిలు , మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలు నిర్వహించండి

సికింద్రాబాద్: తుకారాంగేట్ పహాడీ హనుమాన్ దేవాలయంలో ఈనెల 6న నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకల పోస్టర్‌ను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ గురువారం ఆవిష్కరించారు. టకారాబస్తీలోని ఎమ్మెల్యే నివాసంలో పోస్టర్ ఆవిష్కరణ అనంతరం వేడుకల నిర్వహణ ఏర్పాట్ల గురించి ఆలయ ప్రతినిధులతో చర్చించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి,పోలీస్ అధికారులను కోరారు.

శ్మశాన వాటిక వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం

కంటోన్మెంట్: మారేడుపల్లిలోని హిందూ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. హిందూ స్మశాన వాటిక డెవలప్‌మెంట్ సొసైటీ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే శ్రీగణేశ్ సొంత నిధులతో షెడ్డు నిర్మించారుశ్మే నేపథ్యంలో సోమవారం సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. శ్మశాన వాటిక కేర్ టేకర్ సదానంద్, సొసైట ప్రెసిడెంట్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పనుల ఆలస్యంపై బోర్డు సభ్యురాలి ఆగ్రహం

ఐదోవార్డులో పర్యటించిన భానుక నర్మద


భానుక నర్మదకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కంటోన్మెంట్: వర్క్ ఆర్డర్లు విడుదలై నెలలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడం దారుణమంటూ బోర్డు అధికారులపై సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కంటోన్మెంట్ ఐదోవార్డు శోభన కాలనీ, ఇంద్రపురి రైల్వే కాలనీ, సంతోషిమాత కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తమ కాలనీలో రోడ్డు నిర్మాణం కోసం రూ.42 లక్షలు మంజూరై, ఏడు నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేదని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గత బోర్డు సభ్యుడి నిర్లక్ష్యం వల్లే కంటోన్మెంట్‌లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామన్నారు. అభివృద్ధి పనుల కొనసాగింపు విషయంలో అలసత్వం వహించొద్దని అధికారులను సూచించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు టోపీ శంకర్, నియోజకవర్గ కో- కన్వీనర్ సతీష్, ఇంద్రపురి రైల్వే కాలనీ ప్రెసిడెంట్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.